సాక్షి విశాఖపట్నం

శనివారం । 7 । జూన్ । 2025



రైతులకు వెన్నుపోటు

● అన్నదాత వెన్ను విరిచిన కూటమి ప్రభుత్వం


10లో



పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత

● సీపీ కృతజ్ఞతలు

10లో



త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండగను పురస్కరించుకొని మసీదుల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.. మసీదులు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధి పనుల కోసం ఆయా వార్డు కార్పొరేటర్లకు నిధులు కేటాయించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. అప్రజాస్వామికంగా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కూటమి ప్రభుత్వం, కనీసం పాలననైనా ప్రజాస్వామికంగా నిర్వహించాలని ఆయన హితవు పలికారు. పార్టీలకతీతంగా ఆలోచించి ప్రజా సమస్యలు, వార్డు అభివృద్ధి కోసం దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలకు మాత్రమే కాకుండా, ప్రతి వార్డులో ఆయా వార్డు కార్పొరేటర్లు సూచించిన ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై కూటమి పార్టీల మేయర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలకతీతంగా ప్రజల కోసం ఏ విధంగా పాలన సాగిందో, దానిని దృష్టిలో పెట్టుకుని ప్రజా శ్రేయస్సు కోసం పాలన చేయాలని కేకే రాజు పిలుపునిచ్చారు.

నేడు అప్పన్న నిత్యకల్యాణం రద్దు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం శనివారం రద్దు చేసినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ఈ మార్పు చేశామన్నారు. ఈ నేపథ్యంలో రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని పేర్కొన్నారు. ఈ నెల 10న నృసింహ జయంతిని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని, భక్తులంతా ఈ విషయాలను గమనించాలని పేర్కొన్నారు.

ఖైదీలకు యోగా శిక్షణ



యోగాసనాలు వేస్తున్న ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలోని ఖైదీలు యోగాసనాలలో శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వారికి ఈ శిక్షణ ఇస్తున్నారు. కారాగారం లోపల ప్రశాంతమైన వాతావరణంలో, పచ్చని చెట్ల మధ్య ఖైదీలకు యోగా నేర్పుతున్నారు. ఖైదీలకు ప్రతిరోజూ గంట పాటు యోగాసనాలు నేర్పుతున్నట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం. మహేష్ బాబు శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు ఖైదీలు యోగ సాధనలో పాల్గొంటున్నారని, దీని వల్ల వారి శరీర దృఢత్వంతో పాటు మానసిక స్థితి మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. యోగా దినోత్సవం నాటికి జైలులో ఉన్న అందరి ఖైదీలతో యోగాసనాలలో పాల్గొనే విధంగా చర్యలు చేపడుతున్నట్లు మహేష్ బాబు వెల్లడించారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: యువతలో సాహసోపేత స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిష్ఠాత్మక టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు - 2024కి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాహస రంగంలో అద్భుతమైన పనితీరు కనబరిచి, అత్యుత్తమ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించి, నిర్దిష్ట సాహస విజయాలు సాధించిన వ్యక్తులు ఈ అవార్డులకు అర్హులు. భూమి, జల, వాయు మార్గాల్లో సాహసోపేతమైన కార్యకలాపాలు నిర్వహించిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారు. ఆసక్తిగల మరియు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు https:// awards.gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీని, అవసరమైన ఇతర ధ్రువపత్రాలతో పాటు, జిల్లా యువజన సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు.

రేపు జానపద కళా సంబరాలు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆరిలోవలో జానపద కళా సంబరాలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సరగడ చిన్నారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్తరాంధ్ర జానపద కళలను పరిచయం చేయాలనే ప్రయత్నంలో భాగంగా నవచైతన్య కళా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆరిలోవ కాలనీ శివాజీ నగర్-2లోని ముత్యాలమ్మ గుడి వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ సంబరాలు జరుగుతాయి.

చేతకాక.. కమిషనర్ లేక!



- రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆగ్రహం
- జీవీఎంసీపై కూటమి నిర్లక్ష్యం
- 27 అజెండా అంశాలు.. 6 టేబుల్ అజెండా అంశాలు
- ప్రధాన అజెండాలో 3, టేబుల్ అజెండాలో 2 అంశాలు వాయిదా
- సుదీర్ఘంగా సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. కూటమి ప్రభుత్వ అసమర్థతపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మండిపాటు, కూటమి కార్పొరేటర్ల అసంబద్ధ వాదనలతో రసాభాసగా మారింది. ప్రభుత్వం ఏర్పడ్డాక.. అడ్డగోలుగా మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో చూపిన చొరవ, జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించడంలో చూపకపోవడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ప్లకార్డులతో మేయర్ పోడియంను చుట్టుముట్టి, తక్షణమే జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 నిమిషాలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల నినాదాలతో కౌన్సిల్ హాల్ మార్మోగింది.



కమిషనర్‌ను తక్షణమే నియమించాలంటూ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాస్

డాబాగార్డెన్స్: నూతన మేయర్ పీలా శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాద, ప్రతిపాదనలతో హోరెత్తింది. ప్రధాన అజెండాలోని 27 అంశాలతో పాటు, టేబుల్ అజెండాలోని 6 అంశాలు సభ్యుల చర్చకు వచ్చాయి. వీటిలో 3 ప్రధాన అజెండా(1, 10, 14) అంశాలు, 2 టేబుల్(1, 6) అజెండా అంశాలు తప్ప, మిగిలినవన్నీ ఆమోదం పొందాయి. ఉదయం ప్రారంభమైన సమావేశం రాత్రి వరకు కొనసాగింది.

రెగ్యులర్ కమిషనర్ నియామకం ఎప్పుడు?

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సభను అడ్డుకున్నారు. ప్లకార్డులతో మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, జీవీఎంసీకి తక్షణమే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కీలకమైన కమిషనర్ పోస్టును నెలల తరబడి భర్తీ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని నినాదాలు చేశారు. దాదాపు 15 నిమిషాల పాటు వారి నినాదాలతో సభ దద్దరిల్లింది. మేయర్ పీలా శ్రీనివాసరావు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. మొదట పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాప తీర్మానం చేయాలని సూచించడంతో, వైఎస్సార్‌సీపీ సభ్యులు తమ సీట్లలో కూర్చున్నారు. అనంతరం, ఉగ్రదాడి బాధితులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు.

ఇన్‌చార్జ్ కమిషనర్ రాకపోవడంతో బ్రేక్

ఇన్‌చార్జ్ కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేదు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కమిషనర్ లేకుండా సభను నిర్వహించడాన్ని తప్పుబట్టారు. వారి నిరసనతో మేయర్ పీలా శ్రీనివాసరావు 15 నిమిషాల్లోనే టీ బ్రేక్ ప్రకటించారు. దాదాపు అర గంట తర్వాత కమిషనర్ హాజరు కావడంతో సభ తిరిగి ప్రారంభమైంది.

జీరో అవర్ కోసం పట్టు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ పీలా అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగా, కార్పొరేటర్లు తమ వార్డు సమస్యల పరిష్కారం కోసం జీరో అవర్ కావాలని పట్టుబట్టారు. మేయర్ దీనికి అంగీకరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్ లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. కార్పొరేటర్లు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రెండు, మూడు రోజుల్లో కమిషనర్‌ను నియమించేలా చూడాలని సూచించారు.

ఎవడ్రా నువ్వు..!

జీరో అవర్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతుండగా.. వైఎస్సార్‌సీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన హనోక్, 'ఎవడ్రా నువ్వు'అంటూ నోరు పారేసుకున్నారు. ఈ ఘటనతో సభలో కొంత గందరగోళం నెలకొంది. వెంటనే రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కల్పించుకుని, వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి, పార్టీ మారిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హనోక్‌కు చురకంటించారు. హనోక్ వెంటనే క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'ఎఫ్‌ఆర్‌యూ' ఒప్పందం ఎప్పుడైనా రద్దు చేయొచ్చు



శ్రీహరిపురంలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్ నిర్వహణ కోసం రూ.1.20 కోట్లు కేటాయించడం, విజయ (బెహరా) వెల్ఫేర్ సొసైటీకి చెల్లింపుల ఆమోదంపై జీవీఎంసీ కౌన్సిల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ పీవీ సురేష్ సహా ఇతర కార్పొరేటర్లు మాట్లాడుతూ సొసైటీ ఉచిత సేవలకు బదులు డబ్బులు వసూలు చేస్తోందని, 30 ఏళ్ల లీజుపై కూడా అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హరేంధిరప్రసాద్, సొసైటీ సరిగా పని చేయకపోతే విచారణ జరిపి ఒప్పందాన్ని ఎప్పుడైనా రద్దు చేస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు ద్వారా హామీ ఇచ్చారు.

పీలా గోవింద్ హాజరుపై అభ్యంతరం

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ హాజరుపై డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అభ్యంతరం తెలిపారు. ఏ హోదాలో ఆయన వచ్చారని ప్రశ్నించగా, పీలా గోవింద్ ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అని, ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వుల మేరకు ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చినట్లు అధికారులు వివరించారు.

నైట్ ఫుడ్‌కోర్టుపై మళ్లీ రగడ

జైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టుపై మరోసారి రగడ చెలరేగింది. అనధికారికంగా అనేక మంది స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారని, వీటిని తొలగించాలని కౌన్సిల్‌లో పలుమార్లు చర్చించి తీర్మానం చేసినా చర్యలు తీసుకోకపోవడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో కార్పొరేటర్ పీవీ సురేష్ మాట్లాడుతూ, వార్డుల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదు చేస్తే, జోనల్ కమిషనర్ తేలికగా 'అలాగే జరుగుతాయని'మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

జీవీఎంసీలో ఘోస్ట్ ఉద్యోగులు

జీవీఎంసీలో 'ఘోస్ట్ ఉద్యోగులు'ఉన్నారని, పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. అలాంటి వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ వ్యర్థాలు పంట పొలాల్లోకి చేరి రైతులను ఇబ్బంది పెడుతున్నందున, డ్రైన్‌లు నిర్మించాలని పల్లా సూచించారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయరా?

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పలు కీలక ఆరోపణలు చేశారు. జీవీఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, వారిని ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు. కీలకమైన జీవీఎంసీకి నెలల తరబడి కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. పనుల టెండర్లలో అంచనాల కంటే 25 శాతం తక్కువకు కాంట్రాక్టర్లు పనులు ఎలా చేస్తున్నారని నిలదీస్తూ, అధికారులు ఎక్కువ ఎస్టిమేషన్లు వేస్తున్నారా? లేదా కాంట్రాక్టర్లకు లీకులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.

వాయిదాపడ్డ అంశాలు..

- సీనియర్ అసిస్టెంట్ డి.వెంకట్రావు స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తును సభ్యులు వ్యతిరేకించారు. అతనిపై అనేక ఆరోపణలు ఉన్నందున, పూర్తిస్థాయి విచారణ జరిపే వరకు దరఖాస్తును వాయిదా వేశారు.
- 87వ వార్డులోని కూర్మన్నపాలెం వద్ద ఎంవీవీ అండ్ ఎంకే పార్క్‌కు 150 కేఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు సంబంధించిన పైప్‌లైన్ ప్రతిపాదనకు సభ్యులు అభ్యంతరం తెలపడంతో వాయిదా పడింది.
- స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా 15 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల అభివృద్ధి ప్రతిపాదనను సభ్యులు వ్యతిరేకించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల కాలపరిమితి మార్చి 31తో ముగిసిందని, కేవలం ఇద్దరు ముగ్గురు సిబ్బందితో రూ.కోట్లు విలువైన ప్రాజెక్టులు జరుగుతున్నాయని, దీనిపై సుదీర్ఘంగా చర్చించాలని కోరడంతో వాయిదా వేశారు.
- పరిపాలన సౌలభ్యం కోసం జోనల్ పరిధి మార్పులు చేసే ప్రణాళికను కూటమి సభ్యులతో సహా పలువురు కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించడంతో వాయిదా వేశారు.
- వీటితోపాటు టీడీఆర్‌లు, కోడి మాంసం వ్యర్థాలు, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, షాప్ రూంలు, పార్క్‌ల వంటి అంశాలపై చర్చ అవసరమని సభ్యులు కోరడంతో వాటిని కూడా వాయిదా వేశారు.

ఆమోదించిన అంశాల్లో ప్రధానమైనవి

- రూ.1.96 కోట్లతో 2వ వార్డు కుమ్మరివీధి నుంచి నమ్మివానిపేట కాలనీ బీటీ రోడ్డు విస్తరణ
- జీవీఎంసీలోని ఈఈ-1 పరిధిలో సివిల్ పనుల పర్యవేక్షణకు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఏడాది పాటు కొనసాగింపు
- రూ.55.40 లక్షల అంచనా వ్యయంతో 19వ వార్డు పెదవాల్తేరులో చేపల మార్కెట్ పునరుద్ధరణ
- ఇంజినీరింగ్ విభాగం ఈఈ-5 పరిధిలో 18 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సెక్యూరిటీ గార్డుల కొనసాగింపు

డీఎస్సీ పరీక్షకు 88.39 శాతం హాజరు



ఎగ్జామ్‌హాల్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు

ఆరిలోవ: జిల్లాలో డీఎస్సీ-2025 ద్వారా విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. డీఎస్సీ అభ్యర్థులకు జిల్లాలో విద్యాశాఖ మొత్తం 12 పరీక్షా కేంద్రాలను కేటాయించింది. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో 11 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు పరీక్షల కోసం 2,447 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు పంపించగా, వారిలో 88.39 శాతం (2,163 మంది) హాజరయ్యారు. 284 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌లో 7 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 1,435 మందికి 1,278 మంది (89.06శాతం) హాజరయ్యారు.మధ్యాహ్నం 4 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 1,012 మందికి 885 మంది (87.45శాతం) హాజరయ్యారు. డీఈవో ఒక కేంద్రాన్ని, పరీక్షల స్క్వాడ్ మూడు కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్షలు జరిగిన కేంద్రాలలో బుచ్చిరాజుపాలెంలోని ఏడీజెడ్ ఆరోవనా డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో అత్యధికంగా 450 మంది అభ్యర్థులను కేటాయించగా, నగరంలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో అత్యల్పంగా 85 మంది అభ్యర్థులను కేటాయించారు.

పోర్టు స్టేడియంలో రేపు యోగాంధ్ర వేడుకలు

విశాఖ సిటీ: విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న జరగనున్న దృష్ట్యా సన్నాహాల్లో భాగంగా ఆదివారం పోర్టు స్టేడియంలో వెయ్యి మందితో యోగాంధ్ర-2025 నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆ రోజు ఉదయం 6.30 నుంచి యోగా అసోసియేషన్ సభ్యులు, యూసీడీ సభ్యులు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్లు కార్యక్రమంలో భాగస్వాములై యోగాసనాలు వేయనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు చేపట్టాల్సిన చర్యలను తెలుపుతూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. యోగాసనాలు వేసే స్థలంలో అభ్యసకులకు శిక్షకులు కనిపించేలా వేదిక కల్పించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏయూలో సమూల మార్పులు

విభాగాలకు నూతన డీన్, డైరెక్టర్ల నియామకం



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్, శుక్రవారం పరిపాలనకు సంబంధించి పలువురు డీన్‌లు, డైరెక్టర్‌లను పూర్తిస్థాయిలో మార్పు చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం, సేవలను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ సంస్థాగత మార్పులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కీలక నియామకాలు

డీన్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్, డీన్ అవుట్‌రీచ్, డీన్ అలుమ్నీ రిలేషన్స్, డీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, చీఫ్ కో-ఆర్డినేటర్‌లు వంటి నూతన పదవులను ఏర్పాటు చేశారు. స్పాట్ వాల్యుయేషన్ విభాగానికి చీఫ్ కో-ఆర్డినేటర్‌ను నియమించారు. బోధనా సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్‌ను నియమించారు. డీన్ అలుమ్నీ రిలేషన్స్ పదవిని ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ - సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఓపెన్ లెర్నింగ్‌లను అనుసంధానించి, ఒకే డైరెక్టర్ పరిధిలోకి తీసుకువచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కళల విభాగాలను అనుసంధానం చేయనున్నారు.

నూతన డీన్‌ల వివరాలు

డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్: కె. రాంబాబు, డీన్ అకడమిక్స్ అఫైర్ కె. శ్రీనివాసరావు, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ వల్లికుమారి (కంప్యూటర్ సైన్స్), డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ - సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఓపెన్ లెర్నింగ్ ప్రొఫెసర్ అప్పలనాయుడు (కెమికల్ ఇంజనీరింగ్), డీన్, పీజీ అండ్ ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్స్ ఆచార్య మునిస్వామి (స్టాటిస్టిక్స్), డీన్ అలుమ్నీ రిలేషన్స్ ప్రొఫెసర్ శ్యామల (కెమిస్ట్రీ), డీన్ అవుట్‌రీచ్ ప్రొఫెసర్ కె. రమాసుధ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఎస్. హరినాథ్ (సోషల్ వర్క్), డీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్లానింగ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ కె.ఎస్. రావు (సివిల్ ఇంజనీరింగ్), చీఫ్ కో-ఆర్డినేటర్ స్పాట్ వాల్యుయేషన్ కేటీ బలరాం పడాల్‌ను నియమించారు.

ట్రెజరీలో అడ్డగోలు బదిలీలు

- కౌన్సెలింగ్ నిర్వహించకుండా 34 మందికి స్థానచలనం
- ఐదేళ్ల నిబంధనను పట్టించుకోని అధికారులు



విశాఖ సిటీ: జిల్లా ఖజానా శాఖలో చేపట్టిన ఉద్యోగుల బదిలీలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. నిబంధనలను ఉల్లంఘించి, ఇష్టానుసారంగా బదిలీల ప్రక్రియను ముగించారంటూ ఉద్యోగులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అకౌంటెంట్లు, సబార్డినేట్లకు సంబంధించిన బదిలీలలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు?

సాధారణంగా ఒకే చోట ఐదేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు తప్పనిసరిగా స్థానచలనం కల్పించాలి. అంతేకాకుండా, బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా చేపట్టాలి. అయితే జిల్లా ఖజానా శాఖలో ఈ నిబంధనలను పట్టించుకోకుండా, స్టేట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కనుసన్నల్లో 34 మంది ఉద్యోగులను ఇష్టానుసారంగా బదిలీ చేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఐదేళ్లు పూర్తయినా అక్కడే కొనసాగింపు

ఈ బదిలీల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 12 మందితో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించలేదని సమాచారం. దీనికి తోడు, ఖజానా శాఖలో ఐదేళ్లుగా జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగికి బదిలీ చేయకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవానికి సదరు జూనియర్ అకౌంటెంట్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ పలువురు సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ కూడా జరుగుతోంది. అయినప్పటికీ, ఆరోపణలను, ఐదేళ్ల నిబంధనను పట్టించుకోకుండా అతడిని బదిలీ చేయకపోవడం పట్ల ఆ శాఖ సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

డీటీవో సంతకం చేసి సెలవుపై..?

ఈ బదిలీల ఫైల్‌పై జిల్లా ట్రెజరీ ఆఫీసర్ (డీటీవో) నాగభూషణం సంతకం చేసి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళినట్లు సిబ్బందిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ బదిలీల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని బాధితులు, ఇతర ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నేటి బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్ష వాయిదా

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్యలో బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే శనివారం జరగాల్సిన పరీక్షను బక్రీద్ పండగ కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 11న ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీ పీజీ ఈసెట్ ప్రారంభం


ఏపీ పీజీ ఈసెట్ పరీక్షలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఎంటెక్, ఎం.ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీ పీజీ ఈసెట్ 2025 శుక్రవారం ప్రారంభమైంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ ఈ పరీక్షలను ప్రారంభించారు. పరీక్షల తొలిరోజు ఉదయం సెషన్‌లో 92 శాతం, మధ్యాహ్నం సెషన్‌లో 82 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏయూ నిర్వహిస్తున్న ఈ ప్రవేశ పరీక్ష సెట్ కోడ్‌ను వీసీ విడుదల చేయగా, రెక్టార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, సెట్ కన్వీనర్ ఆచార్య పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పరీక్షలు శని, ఆదివారాల్లో కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు వెన్నుపోటు


భీమిలిలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



- అన్నదాత వెన్ను విరిచిన కూటమి ప్రభుత్వం
- అటకెక్కిన 'అన్నదాత సుఖీభవ'
- భరోసా కల్పించని ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం

తగరపువలస: కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన 'అన్నదాత సుఖీభవ' పథకం హామీ అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. ఏటా రూ.20,000 రైతులకు అందించకపోవడంపై అన్నదాతలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏడాది గడిచినా ఒక్క పైసా కూడా అందలేదని, ఇది మోసపు హామీతో తమకు వెన్నుపోటు పొడవడమేనని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం అందకపోగా, సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో కూడా విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి, ఆ భారాన్ని రైతులపైనే మోపడం, అరుగాలం శ్రమించి పండించిన పంటలను రక్షించడానికి సమీక్షలు లేకపోవడం, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, రైతు సహాయకులను సచివాలయాలకే పరిమితం చేయడం వంటివి రైతుల కష్టాలను మరింత పెంచాయని అంటున్నారు. చాలావరకు రైతు భరోసా కేంద్రాలు తెరచుకోవడం లేదని, కనీస మద్దతు ధర కూడా ఇవ్వలేకపోయారని, ఆక్వా, పాడి రైతులను కూడా నిట్టనిలువుగా ముంచేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి వచ్చాక అప్పులపాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సహాయ కార్యక్రమాలు నిలిచిపోయాయని, దీంతో గత ఏడాది రైతులు అప్పుల పాలయ్యారని, ప్రస్తుతం సీజన్ ప్రారంభం కానున్నందున అధిక వడ్డీల బాధ ఉన్నా అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పండగలా సేద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో వ్యవసాయాన్ని పండగలా మార్చిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ అమలు చేశారని, కౌలు రైతులతో సహా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం నేరుగా రైతుల ఖాతాలకు బదిలీ చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 24,925 మంది రైతులకు ఐదేళ్లలో రూ.112.62 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయితీలో రైతు భరోసా కేంద్రాలను సొంత భవనాలలో ఏర్పాటు చేసి, నకిలీ విత్తనాలు, ఎరువుల నివారణకు సాగు సీజన్‌కు ముందే కియోస్కల ద్వారా విత్తనాలు, డీఏపీ, యూరియా అందుబాటులో ఉంచేవారని గుర్తుచేసుకున్నారు. రైతు సహాయకులను నియమించి, వారి ద్వారా మట్టి నమూనా పరీక్షలు, సాగు చేయవలసిన పంటలు, తెగుళ్ల నివారణ, పండిన పంటకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు గోనె పట్టాలు, రవాణా సౌకర్యం కల్పించారని తెలిపారు. భీమిలిలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షించడంతో పాటు, పశువులలో తలెత్తే రోగాల నిర్ధారణ, చికిత్స కూడా అందించేవారని వివరించారు. అతివృష్టి, అనావృష్టి సమయంలో రైతు నష్టపోకుండా ఉచిత పంటల బీమా పథకం ద్వారా భరోసా కల్పించారని, వైఎస్సార్ జలకళ కింద రైతులకు ఉచితంగా బోర్లు తవ్వించి మోటార్లు ఏర్పాటు చేశారని అన్నారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రాష్ట్ర రైతులకు అండగా నిలిచారని, ఆ ఐదేళ్ల బ్యాంకులు కూడా రైతులకు విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు వాయిదాలు ఆలస్యం అయినా వేధించేవారు కాదని రైతులు తెలిపారు. ప్రజాప్రతినిధులను గడప గడపకు పంపించి, ఏ కారణం చేత అయినా సాయం అందకపోతే తక్షణం అందేలా చర్యలు తీసుకునేవారని అన్నారు.

- జిల్లాలో సాగు భూమి 4,454 హెక్టార్లు, అందులో 78 హెక్టార్లు మెట్ట భూమి.
- రైతు భరోసా కేంద్రాలు 57 (భీమిలి 13, ఆనందపురం 18, పద్మనాభం 16, పెందుర్తి 10)
- కౌలు రైతులు 504
- మొత్తం రైతులు 22,569

రూ.లక్ష ఉంటే తప్ప గట్టెక్కలేను



నాకు 4 ఎకరాలతో పాటు లీజుకు తీసుకున్న 8 ఎకరాలలో నారు, ఉడుపుల కోసం ప్రారంభంగా రూ.లక్ష ఉంటే కాని ఈ సీజన్ గట్టెక్కే పరిస్థితి లేదు. ఇంకా ఎరువులు, విత్తనా లు, కూలీల ఖర్చులకు అంతే ఉండదు. కూటమి ప్రభుత్వం కారణంగా ఏడాదిగా రైతులు కరువు భారిన పడినట్టుంది.
– కనకల శ్రీను, బోని

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి



నేను చిన్న రైతును.. 50 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. మాజీ సీఎం వైఎస్ జగన్ చెప్పినట్టుగా అయిదేళ్లు పెట్టుబడి సా యం అందించడం మాలాంటి చిన్న రైతులకు వరం. బీమా, రుణమాఫీ వంటివి అదనంగా చేశారు. చంద్రబాబు కూడా మాట నిలబెట్టు కుని అన్నదాత సుఖీభవ సాయాన్ని ప్రతి రైతుకు అందజేయాలి. – కోరాడ రాము, టి.నగరపాలెం

జగన్ హయాంలో భరోసా ఉండేది



నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గత జగన్ ప్రభుత్వంలో జూన్ నాటికే విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉండేవి. పొలాలలో మట్టి పరీక్షలు చేసి ఎరువులు ఎంత వాడాలి, ఏ రకం పంటలు వేయాలి చెప్పేవారు. నాట్లు వేసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు అధికారులు వివరించేవారు.
– రొంగలి తవిటమ్మ, సామయ్యవలస

రైతులపై బీమా భారం



నాకు ఎకరా భూమి ఉంది. కూటమి ప్రభుత్వం బీమా పథకం రద్దు చేసి మా రైతులపై ఆ భారాన్ని మోపింది. ఖరీఫ్ 23 సీజన్‌కు ఈ ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులకు పంట బీమా పరిహారం దక్కకుండా పోయింది. ఉచిత పంటల బీమా అమలు చేయాలి.
– కనకల అప్పలకొండ, ఆనందపురం

దారి కనిపించడం లేదు



నేను రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు సాయం ఇవ్వలేదు. దీంతో పెట్టుబడి దొరకక అప్పులు చేశాం. కానీ పండిన పంట వర్షాలకు గడచిపోయి కొంత ధాన్యం వృథాగా పోయింది. ఇప్పుడు మళ్లీ పెట్టుబడికి డబ్బులు కనిపించడం లేదు.
– బుగత అప్పలనాయుడు, పద్మనాభం

గడువులోగా చేరకపోతే సీట్లు రద్దు

- గురుకులాల్లో 94 సీట్లు ఖాళీ

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి కేటాయించిన సీట్లలో విద్యార్థులు వెంటనే చేరాలని గురుకులాల సమన్వయాధికారి సి. ప్రభావతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 11 గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది ఏప్రిల్ 13న రాత పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన 565 మంది విద్యార్థులకు గానూ ఇప్పటివరకు 471 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. మిగిలిన 94 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆయా విద్యార్థులు వెంటనే వారికి కేటాయించిన గురుకులాల్లో చేరాలని ఆమె సూచించారు. లేని పక్షంలో వారి సీట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు మరో థర్డ్ ఏసీ కోచ్

తాటిచెట్లపాలెం: ఈ నెల 10న విశాఖపట్నం–అమృతసర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు, 14న అమృతసర్–విశాఖపట్నం(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు మరో థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.


నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని జోన్–3, 5, 8లలో శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ప్రధాన ఇంజినీర్ కేవీఎన్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన పీడబ్ల్యూడీ పంప్‌హౌస్ వద్ద 11 కేవీ/33 కేవీ విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేస్తారు. దీంతో కింద పేర్కొన్న ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ఆయా ప్రాంతాల ప్రజలు జీవీఎంసీకి సహకరించాలని ప్రధాన ఇంజినీర్ కోరారు.

- జోన్–3 పరిధిలో డాక్టర్స్ కాలనీ, ఎం.ఎం.టి.సి. కాలనీ, ఏపీఎస్‌ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీనగర్ ఏరియా, రామకృష్ణా నగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్–16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియా, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాలు.
- జోన్–5 పరిధిలో లక్ష్మీనారాయణపురం–1, 2, లెప్రసీ కాలనీ, కస్తూరినగర్–1, శాంతినగర్–1,2, సంజీవయ్యకాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాష్‌నగర్, మహాత్మాగాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, అరుంధతి నగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లేఅవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లేఅవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్ గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతీనగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హౌస్సెన్‌నగర్, ఆర్‌పీ పేట తదితర ప్రాంతాలు.
- జోన్–8 పరిధిలో లక్ష్మీనగర్–ఎఫ్ బ్లాక్ పార్ట్, సీ, డీ బ్లాక్స్ పార్ట్, శ్రీనివాసనగర్, ఆర్‌ఆర్‌వీ పురం రజక కాలనీ తదితర ప్రాంతాలు..

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత

విశాఖ సిటీ: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్)లో భాగంగా ఇనార్బిట్ మాల్స్ యాజమాన్యం విశాఖ పోలీస్ శాఖకు అధునాతన డ్రోన్‌ను అందజేసింది. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఈ డ్రోన్‌ను మాల్ ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఇనార్బిట్ మాల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ డ్రోన్ల సాయంతో నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను సులువుగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. వీఐపీల బందోబస్తుకే కాకుండా నగరంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్‌తో నిఘా ఏర్పాటుకు దోహదపడుతుందని చెప్పారు. పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ఇనార్బిట్ మాల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూసఫ్ మియాన్ సయ్యద్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర హూరే, అకౌంటెంట్ రామ్ సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.



వినీలాకాశంలో శుక్రవారం అద్భుత దృశ్యం అబ్బురపరిచింది. నీలి రంగులో ఉండే విశాలమైన కాన్వాస్‌పై పక్షుల గుంపు రిథమిక్‌గా సాగిపోతున్న తీరు చూపరులను మంత్రముగ్ధులను చేసింది. సాయంత్రం సమయంలో ఆకాశం నిర్మలంగా, నీలి రంగులో మెరిసిపోతోంది. అక్కడక్కడ చిన్నపాటి మబ్బులు తేలియాడుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో వందల సంఖ్యలో పక్షుల గుంపు ఒక పర్వతం ఆకారాన్ని తలపించేలా గాల్లో కదులుతూ ప్రయాణించింది. లయబద్ధంగా సాగిన వాటి ప్రయాణం.. చూసిన ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచింది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పవన్ కార్తీక్


ఎన్నికైన నూతన కార్యవర్గం

ఏయూక్యాంపస్: హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (హెచ్ఆర్ఏఏపీ) నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.వి. పవన్ కార్తీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జైదీప్ బిశ్వాస్, కోశాధికారిగా ఆర్. వెంకటరావులను ఎన్నుకున్నారు. సలహా మండలి సభ్యుడిగా డాక్టర్ ఎస్. ప్రశాంత్ వ్యవహరిస్తారు. నూతన కార్యవర్గం రాష్ట్రంలో పర్యాటకం, ఆతిథ్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేస్తుందని అధ్యక్షుడు పవన్ కార్తీక్ తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తామన్నారు.

9న స్టీల్‌ప్లాంట్ సంఘీభావ ర్యాలీ

- కార్మికులు నిరసనల్లో పాల్గొనాలి
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ

అల్లిపురం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అన్యాయంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నిరసనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 3,500 మందికి పైగా కార్మికులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ నష్టాలకు కార్మికులను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. దేశంలోని ఇతర స్టీల్ పరిశ్రమలకు సొంత గనులు ఉండగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. అనకాపల్లిలో ఇంకా ఏర్పాటు చేయని మిట్టల్ స్టీల్ పరిశ్రమకు గనులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అడగడం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 20 నుంచి జరిగిన సమ్మెను ప్రభుత్వం, యాజమాన్యం పోలీసు నిర్బంధంతో అణచివేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 9న కార్మికులు తమ పని ప్రదేశాల్లో, అన్ని పరిశ్రమల వద్ద జరిగే నిరసనల్లో పాల్గొనాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఉదయం 10 గంటలకు స్టీల్ ప్లాంట్ సంఘీభావ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

సామాజిక సందేశంతో ఆకట్టుకున్న నాటికలు


దోషేచ వహ్నిః నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ నాటక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం రెండు సందేశాత్మక నాటికలను ప్రదర్శించారు. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, నాంచారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా స్నిగ్ధ కలం నుంచి జాలువారిన 'దోషేచ వహ్నిః' నాటిక ప్రదర్శించారు. మధ్యతరగతి కుటుంబాల్లో కుమార్తెను అత్తవారింటికి పంపిన తర్వాత, ఆ తల్లిదండ్రులు సర్వం కుమార్తెకు ధారపోస్తూ, కోడలి వేదనను పట్టించుకోని ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభ, రూపేచ లక్ష్మి, క్షమయా ధరిత్రి' అనే ఆరు సూత్రాలను పాటిస్తూ జీవించే స్త్రీ పాత్రను ఈ నాటిక స్పృశించింది. అయితే భర్త తప్పు చేసినప్పుడు.. సప్తమ సూత్రంగా 'దోషేచ వహ్నిః' అని స్త్రీ చైతన్యవంతురాలై తనకు తానుగా లిఖించుకోవాలి అన్న సందేశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కథాంశానికి తగ్గట్టుగా నటీనటుల చక్కని నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. రెండవ నాటికగా కెరటాలు ప్రదర్శించారు. భాగవతుల రమాదేవి రచించిన 'కెరటాలు'కథకు మునిపల్లె విద్యాధర్ నాటకీకరణ చేశారు. ఆధునిక భావాలతో నేటి యువత, ముఖ్యంగా మహిళలు తమ తల్లిదండ్రులను, ఆ తర్వాత భర్తను కూడా ఎదిరించడమే అభ్యుదయంగా భావించి తమ జీవితాలను, భవిష్యత్‌ను భగ్నం చేసుకుంటున్నారు. అలాంటివారు కెరటాల్లో కొట్టుకు పోకుండా.. గతంలో కొందరి జీవితాలను ఉదాహరణగా తీసుకుని ఒడ్డుకు చేరాలనే సందేశమిస్తూ ఈ నాటిక సాగింది. ఈ రెండు నాటికలను రాజాం కళాక్రియేషన్స్ సంస్థ ప్రదర్శించింది.